17వ
నేటి దినపత్రిక సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,1 జనవరి 2024

కోడి పందాలు, జూదం, గుండాటలపై నిషేధాజ్ఞలు

ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్ కె.ఖాజావలి

ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు రెవిన్యూడివిజన్ పరిధిలో ప్రజలందరూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి ఆదేశముల ప్రకారము కోడి పందెములు, జూదం, గుండాట మొదలగునవి అడుటపై నిషేధ అజ్ఞలు ఉన్నందున సదరు ఆదేశములు ఉల్లంగించిన వారి పైన ఉల్లంగించినవారికి, సహకరించిన వారిపైన చర్యలు తీసుకోబడునని ఏలూరు ఆర్డివో ఎన్.ఎస్ కె ఖాజావలి తెలిపారు. రైతులు,ప్రజలు కష్టపడి సంపాదించిన సంపాదనను వృదా చేయకుండా సంక్రాంతి పండుగను బంధువులు,కుటుంబసభ్యులతో జరుపుకోవలసినదిగా ఆర్డీవో విజ్ఞప్తి చేశారు.
ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ 2016 డిసెంబర్ 26వ తేదీన యిచ్చిన ఉత్తర్వులుప్రకారము కోడి పందేలు, జూదం, గుండాట మొదలగునవి ఆడుటపై నిషేద ఆజ్ఞలు వున్నాయన్నారు. కనుక ఈ విషయములో ఉత్తర్వులు ఉల్లంగించిన వారిపై తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకోబడునని పత్రికాముఖముగా గతంలో కూడా తెలియచేయడమైనదన్నారు. ప్రజలందరుఅప్రమత్తమై, వారి దృష్టికి సాంఘిక వ్యతిరేక కార్యాలకు పాల్పడు వ్యక్తులు గురించి,ప్రదేశముల గురించి సమాచారము తెలిసిన వెంటనే వాడు సంబంధిత తహసిల్దార్ వారికి లేదా స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కి లేదా గ్రామ రెవిన్యూ ఆఫీసర్ కి లేదా పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని ఆర్డీవో కోరారు. అటువంటి సమాచారం తెలియజేసినవారి వివరములు రహస్యముగా ఉంచబడుతాయన్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
-కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు,మేజర్న్యూస్:నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు ఆదివారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో ఏలూరు జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో మంచి పంటలు పండి, విద్యా, పారిశ్రామిక పరంగా కూడా మంచి అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కరోనా మహమ్మారినీ దరి చేరకుండా మాస్కులు ధరించడం, శుభ్రతను పాటించడం వంటి అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు.

వైయస్ఆర్ పెన్షన్ కానుక
రు.2750 నుంచి రూ.3 వేలకు పెంపు

2 నుండి 8 వరకు మండలాల వారీగా వేడుకగా పెన్షన్ పంపిణీ
కొత్తగా జిల్లాకు మరో 9,326 పెన్షన్లు మంజూరు
జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వెల్లడి

ఏలూరు,మేజర్న్యూస్:సామాజికభద్రతకింద అందచేస్తున్న "వైఎస్ఆర్ పింఛను" కానుక 2024 జనవరి నుంచి మరో రూ.250లు పెంచడం ద్వారా రూ.3వేలను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదివారంతెలిపారు. జిల్లాలో ఫింఛన్ల పంపిణీ కార్యక్రమము ప్రజాప్రతినిధుల సమక్ష ములో ఈనెల 2వతేది నుండి 8వ తేదీ వరకు ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. మండలాలు, పురపాలక సంఘాలు వారీగా ఈ విధంగా పంపిణీ జరుగుతుందని తెలిపారు.జనవరి 2కలిదిండి మండలం ఉ.10.30 గంటలకు,ఉ.10కి బుట్టాయిగూడెం మండలం,జనవరి 3-ఉ.10కిచింతలపూడి చింతలపూడ (అర్బన్),పెదవేగి,ఏలూరు రూరల్, అర్బన్, పోలవరం ,నూజివీడు,ఉ.9కి కైకలూరు,ఉ.10కిమండవిల్లి, ఉ.11.30కు ముదినేపల్లి మండలాలు,జనవరి 4 - ఉ.10కి జంగారెడ్డగూడెం అర్బన్,రూరల్,పెదపాడు, నూజివీడుఅర్బన్,భీమడోలు, టి.నర్సాపురం,. ఉంగుటూరు మండలాలు, జనవరి 5- ఉ.10కు కామవరపు కోట,మ.2కు లింగపాలెం, ఉ.10కు దెందులూరు,ద్వారక తిరుమల, చాట్రాయి, కొయ్యలగూడెం,గణపవరం,మ.2కు నిడమర్రు మండలంలో కంపెనీ జరుగుతుందని వివరించారు. జనవరి 6-ఉ.10కు ముసునూరు, జీలుగుమిల్లి మండలాలు, జనవరి 7: ఉ.10కు ఆగిరిపల్లి మండలం, జనవరి 8 : ఉ.10కు కుకునూరు మండలం, వేలేరుపాడు మండలం లో పంపిణీ జరుగుతుందన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ఏలూరు జిల్లాలో 2,33,726 మందికి వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకార్మికులు, ఒంటరి మహిళలకు జనవరి నుంచి రూ. 2,750- నుంచి రూ. 3 వేలకు ప్రభుత్వం పెంపుదల చేసిందన్నారు. జిల్లాలో 2,33,726 మంది పెన్షన్లకు గాను పెంచిన మొత్తం కింద ప్రతినెలా అధనంగా రూ. 5.84 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదే విదంగా వీటితోపాటు జిల్లాలో మిగిలిన ఇతర రకాల పెన్షన్ల తో కలిసి మొత్తం 2 లక్షల 87 వేల 845 మందికి రూ. 85.94 కోట్లు జనవరి 2వ తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో జనవరి నెల నుంచి కొత్తగా మంజూరు చేసిన 9వేల 326 పెన్షన్లు ఉన్నాయన్నారు. ఇతర పెన్షన్ల కింద 44 వేల 793 మంది లబ్దిపొందుతున్నారన్నారు.

ముఖ్య గమనిక :
వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపుదల కార్యక్రమము ఈనెల 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందనీ. కావున అందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు మునిసిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బంది/వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీకి తేదీని పింఛనుదారులకు వ్యక్తిగతముగా తెలియజేయలనీ డిఆర్‌డిఎ పిడి ద్వారా తెలియజేయడ అయిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జెసి

ఏలూరు, మేజర్ న్యూస్: నూతన సంవత్సరం సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరంలో అందరికీ అంతా మంచి జరగాలని, ప్రతి ఒక్కరి జీవితంలో 2024 సంవత్సరం కాంతులు నింపాలని కోరుతూ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల ఆర్థిక ప్రగతికి తపన ఫౌండేషన్ కృషి
ట్రస్టీ గారపాటి రేణుక

టి.నర్సాపురం,మేజర్ న్యూస్: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 80 మంది మహిళలకు తపన ఫౌండేషన్ ట్రస్టీ గారపాటి రేణుక సర్టిఫికెట్లను అందజేశారు. టీ నర్సాపురం మండలం తిరుమలదేవి పేట, శ్రీరామవరం గ్రామాల్లో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో 90 రోజులపాటు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం పూర్తి ఆయన సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గారపాటి రేణుక మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొంది మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి ఆర్థిక పురోగతి సాధించాలనే ఉద్దేశంతో తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 20కి పైగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 2008 జనవరి 27న తపన ఫౌండేషన్ ఏర్పాటుచేసి అప్పటినుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో తపన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, అజయ్, శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పేలా మీడియా ఉండాలి
ఎస్ఎస్ఎస్ ఆర్‌టివి క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి కారుమూరి

తణుకు,మేజర్ న్యూస్: ఎస్ ఎస్ఎస్ఆర్‌టివి రానున్న రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా ప్రజలకు తెలియజేసేలా మీడియా ఉండాలని,ప్రజలకు మరింత చేరువ అవ్వాలని కోరుకుంటున్నట్లు , ఈ సందర్భంగా ఎస్ ఎస్ ఎస్ ఆర్ టివి యాజమాన్యానికి,ప్రేక్షకులకు వైఎస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలోటీవీ ఛానల్ సీ ఈఓ డా.ఆర్కే నీతిపూడి,ఎస్ ఎస్ఎస్ఆర్‌టి న్యూస్ బ్యూరో ఎన్.సీతా రామరాజు,వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు పెన్మెత్స సుబ్బరాజు, నున్న ప్రసాద్, సూరంపూడి కామేష్ ,ఎస్ఎస్ఎస్ ఆర్‌టివి పశ్చిమ గోదావరి జిల్లా రిపోర్టర్ ఎన్ .ఎస్. రావు,తాటిపర్తి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- ఐసిఎం బిషప్ మోస్ట్ రెవ.డా.ఎన్.జాన్ యస్‌డి రాజు

మండవల్లి, మేజర్ న్యూస్: మన ప్రభువును, రక్షకుడునైన... ఏసుక్రీస్తు ప్రశస్త నామములో మీకు శుభములు కలుగును గాక.. గడచిన సంవత్సర కాలమ ంతా మనల్ని సజీవులుగాను, ఆరోగ్యవం తులుగాను ఉంచి, ఈ సంతోషకరమైన క్రిస్మస్ ఆనందాన్ని అనుభ వించడానికి ప్రభువు చూపిన కృపను బట్టి మనం అందరం దేవునికి కృతజ్ఞతలు చెల్లించుదాం. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఏలూరు ఐసిఎల్ పీఠాధిపతి డాక్టర్ ఎన్. జాన్ ఎస్ డి రాజు పేర్కొన్నారు. దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించి, నశించిన దానిని వెదకి రక్షించుటకై తన అద్వితీయ కుమారుడైన యేసయ్యను మానవావతాదిగా బేత్లహేము పురములో కన్య మరియకు జన్మింపచేసిన సంతోషకరమైన దినం క్రిస్మస్ అన్నారు. మీకు మీ కుటుంబాలకు క్రిస్మస్, నూతన సంవత్సర దీవెనలు శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. నూతన 2024 సంవత్సరమంతా ప్రభువు మిమ్ములను శాంతితోను,సమాధానముతోను జీవింపజేయును గాక. ప్రభువు మిమ్ములను దీవించును గాక అని బిషప్ జాన్ ఎస్ డి రాజు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

రెండు సున్నాలు కలిస్తే పెద్ద బోడి సున్నా

టిడిపి, జనసేన పొత్తుపై డిప్యూటీ సీఎం 'కొట్టు' వ్యాఖ్య

తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : రెండు సున్నాలు కలిస్తే పెద్ద బోడి సున్నా అవుతుందని తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. వాళ్ల కలవడం వలన వన్ ప్లస్ వన్ టూ అనుకుంటున్నారు కానీ సున్నా సున్నా కలిస్తే సున్నా అవుతుందని ఇలా రెండు సున్నాలు కలవడం వల్ల పెద్ద బోడి సున్నా అవుతుంది తప్ప మరేమీ కాదన్నారు. గత ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ వాటిని అమలు చేయకపోగా చివరకు మేనిఫెస్టోను కూడా ఆ పార్టీ వెబ్సైట్ నుంచి మాయం చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ ఆ శక్తులన్నీ కలిసి దొంగ వాగ్దానాలు, అబద్ధపు మాటలతో ప్రజలను వంచించడానికి తయారవుతున్నాయని ఆయన విమర్శించారు. 2024 సంవత్సరానికి చాలా ప్రాధాన్యత ఉందని, మన భవిష్యత్తు బాగుండేలాగా మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. వైకాపా ప్రభుత్వం కొనసాగి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, పేదల కుటుంబాలలో సంతోషం వెల్లి విరుస్తుందన్నారు. పది ఎకరాల్లో గ్లోబల్ పార్క్ ఏర్పాటు..తాడేపల్లిగూడెం పట్టణం నడిబొడ్డున పది ఎకరాల్లో అన్ని హంగులతో అతిపెద్ద పార్కు ఏర్పాటు చేయబోతున్నట్లు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న పంపులు చెరువుకు తోడుగా అదనంగా మరో 70 ఎకరాల్లో రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిని సుమారు 75 కోట్ల తో పూర్తిగా సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులతో ఆధునిక డిజైన్లు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. వచ్చే నెల నుంచే ఈ పనులు మొదలవుతాయని ఆయన చెప్పారు. మంచి సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మంత్రి కొట్టు పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలన చూసాం, జగనన్న పాలన చూసాం.... ఈ రెండింటిని బెరీజు వేసుకుని ఎవరి పాలనలో మనకు మేలు జరిగిందో ఆలోచించుకునే మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. దొంగ ఎవరు, దొర ఎవరు... అనేది ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు అబద్దాలు చెప్పడంలో ఘనులని విమర్శించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో చిలకంపాడు లాకులు నుంచి డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు 42 కోట్లతో నాలుగు లైన్లు రహదారి నిర్మించామన్నారు. బాదంపూడి నుంచి ప్రత్తిపాడు సాక్షి జంక్షన్ వరకు 10 కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణం చేపడుతున్నామన్నారు. పెంటపాడు మండలం కే.పెంటపాడు నుంచి పడమర విప్పర్రు గ్రామం వరకు 10 కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇలా నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో రహదారులు నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. ఈయన వెంట టౌన్ పార్టీ ప్రెసిడెంట్ గుండుబోగుల నాగు, టౌన్ జెసిఎస్ కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, విజయవాడ కనకదుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దన్ రావు, మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి ఉన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ప్రయోజనకరం

పెదవేగి,మేజర్న్యూస్:కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఈవోపీఆర్డి బి. శ్రీనివాసులు అన్నారు. విజ రాయిలో ఆదివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వంటి పథకాలు పేదలకు ఎంతో ప్రయోజన కారిగా ఉన్నాయన్నారు. సీఎం ముద్ర యోజన, ఆవాస యోజన, విశ్వ కర్మ యోజన వంటి పథకాలు పేదలు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలని శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, మన రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీనారాయణపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షులు ఉండవల్లి వెంకటరావు, ఉప సర్పంచ్, ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.జానం పేటలో వికసిత్ భారత్‌సంకల్ప యాత్ర అనంతరం జానంపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవోపీ ఆర్డీపీ శ్రీనివా సులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ యోజన, పీఎం సురక్ష యోజన,జీవన జ్యోతి భీమా యోజన వంటి ఎన్నో సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో అమలు చేస్తుందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమ ంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరు లక్ష్మీనారాయణ, బిజెపికిసాన్ మోర్చా అధ్యక్షులు ఉండవల్లి వెంకటరావు,పలువురుఅధికారులు మహిళలు హాజరయ్యారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నేత వీరమల్లు బ్రదర్స్

కైకలూరు,మేజర్న్యూస్:నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కైకలూరు నియోజకవర్గంలోని పాత్రికేయులు అందరికీ టిడిపి నాయకులు వీరమల్లు వెంకట సత్యనారాయణ, నరసింహారావు(బ్రదర్స్) ఆర్థిక సహాయంతో నూతన సంవత్సర కానుకలను అందజేశారు. ఆదివారం కైకలూరు నియోజకవర్గం టిడిపి కార్యాలయం నందు టిడిపి నేతలు పెనుమత్స వెంకటేశ్వరరాజు, త్రినాథ రాజు, పోలవరపు లక్ష్మీరాణి, వీరాబత్తిన సుధా, రామకృష్ణ చేతుల మీదుగా స్థానిక పాత్రికేయులకు వీరమల్లు బ్రదర్స్ న్యూ ఇయర్ గిఫ్ట్ లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వీరమల్లు బ్రదర్స్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు పాత్రికేయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అదేవిధంగా కలిదిండి, మండవల్లి, ముది నేపల్లి మండలాల వారీగా బహుమతులు అందించారు. అనంతరం పాత్రికేయులు మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల సేవలను గుర్తించి నూతన సంవత్సర కానుకలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

టెండర్లు పూర్తయిన పనులు వెంటనే ప్రారంభించాలి
ప్రభుత్వ విప్ ముదునూరి

నరసాపురం,మేజర్న్యూస్ :నిధులు మంజూరై టెండర్లు ప్రక్రియ పూర్తయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు.ఆదివారం ముదునూరి ప్రసాద రాజు క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనియోజకవర్గంలో రూ 12, కోట్లతో నిర్మించే కాళీపట్నం జగన్నాధపురం, టెండర్లు ప్రక్రియ పూర్తయినవి. రూ20 కోట్లతో పనులు జరుగుచున్న లక్ష్మణేశ్వరం పెదమైన వానిలంక రోడ్లు పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆయన అన్నారు. రూ3 కోట్లకు టెండర్లు పూర్తయి ఇంకా పనులు మొదలు పెట్టని నరసాపురం, కరీంశెట్టిపాలెం, నరసాపురం, తూర్పు తాళ్ల, రోడ్డు పనులను ఒకటి రెండు రోజుల్లో పనులు మొదలు పెట్టాలని ఆయన అన్నారు. మొగల్తూరు మండలం జిల్లేడుతిప్ప , కొత్తట ,వెంప, కాళీపట్నం, రూ9, కోట్లు టెండర్లు ప్రారంభించాలన్నారు. మెట్రేవు సి సోర్ రహదారి పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులతో ఆయన అన్నారు. పనులు పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నరసాపురం మండలం జెడ్ పిటిసి బొక్క రాధాకృష్ణ, మొగల్తూరు మండలం జడ్పిటిసి తిరుమని బాబ్జి జిల్లా రోడ్డు భవనాల శాఖ ఇంచార్జ్ అధికారి లోకేశ్వరరావు డిఇ కిరణ్, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులు కలిగి ఉండాలి
టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బడేటి చంటి

ఏలూరు,మేజర్ న్యూస్: నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులు కలిగి ఉండాలని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి పడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక మూడో డివిజన్ నుంచి టిడిపి ఎస్ సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాల బాలాజీ ఆధ్వర్యంలో మూడో డివిజన్ నుంచి టిడిపి సీనియర్ నాయకులు ఎస్సీ, బీసీ, మైనార్టీస్ నాయకులతో ఏలూరు బడేటిరాధాకృష్ణయ్య (చంటి) ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ కొత్త సంవత్సరం ఏలూరు ప్రజలకి సుఖశాంతులు కలగాలని రాబోయే రోజులలో టిడిపి ప్రభుత్వమే వస్తుందని, జాతీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మూడవ డివిజన్ అధ్యక్షులు సేనాపతి వెంకటరమణ,దాలి త్రిమూర్తులు,రూపేష్,ఏసు, గుంటూరు ప్రకాష్ యూత్,వి రత్తయ్య, క్రిస్టియన్ సెల్ 3వ డివిజన్ నాయకులు వీర బత్తుల రాజేష్, శ్యామ్, మైనారిటీస్ నాయకులు ఎస్.కె దావీద్,పాల్గొన్నారు.

పీఎం ప్రారంభించిన అమృత్ భారత్ రైలుకు జెండా ఊపిన జడ్పీ చైర్పర్సన్

ఏలూరు, మేజర్ న్యూస్ : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన మాల్దా టౌన్ - బెంగళూరు అమృత్ భారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంకా వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద్ తదితరులు పాల్గొని రైలుకు పచ్చ జెండా ఊపారు .ఈ సందర్భంగా ప్రయాణికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వికసిత్ భారత సంకల్ప యాత్ర..

జీలుగుమిల్లి. మేజర్ న్యూస్ మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయం వద్ద, పి రాజవరం వద్ద ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కర్రి బండి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించబడతాయని ఆయన అన్నారు. బిజెపి పార్టీ దేశ ప్రజల సంక్షేమానికి దేశ సమగ్రతకు కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం హెల్త్ కార్డులను గ్యాస్ బండలను మహిళలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కాంచనమాల. పోలవరం బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ. బిజెపి మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్. ప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి రేపాక గోపాలరావు. వివిధ శాఖల మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ముదునూరి

నరసాపురం, మేజర్న్యూస్ : నియోజకవర్గ ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. రాగద్వేషాలు, భేదాబి ప్రాయాలకు అతీతంగా అందరూ ఐక్యంగా అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో నూతన సంవత్సరంలో సకల సౌఖ్యాలతో ఆరోగ్యం గా ఉండాలని ముదునూరి ప్రసాదరాజు ఆకాంక్షించారు.

డిపాజిట్లు గల్లంతైనా
జనసేనకు సిగ్గు రాలేదు

వైసిపి ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు 'బుడితి'



నర్సాపురం,మేజర్న్యూస్: జనసేన పేరుతో రాజకీయ పార్టీ పెట్టి సుమారు పది సంవత్సరాలు కావస్తున్నా ఎమ్మెల్యేగా గెలవని అధినేత పవన్ కళ్యాణ్, కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేని ఆ పార్టీ నాయకులు కనివిని ఎరగని రీతిలో భారీ ప్రభంజనంతో విజయం సాధించి దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయేసుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు బుడితి సుమన్ కుమార్ ఎద్దేవాచేశారు. ఆదివారం నరసాపురంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పోటీ చేసిన ప్రతిసారి ప్రజలు ఛీకొడుతున్న పవన్ కల్యాణ్‌కు జనసేన నాయకులకు సిగ్గ అనిపించడం లేదని, ఇక చేసేదేమీ లేక చంద్రబాబుకు చెంచాగిరి చేయడానికి సిద్ధపడడం దౌర్భాగ్యం అని అన్నారు. జనసేన బహిరంగ సభల్లో స్టేజ్ ఎక్కిన వెంటనే పూనకం వచ్చినట్లు ఊగిపోవడం, నోటికి ఇష్టం వచ్చినట్లు వ్యక్తిగత విమర్శలు చేస్తూ మాట్లాడే పవన్ కళ్యాణ్ ,అతని అనుచరులు సిగ్గుతెచ్చుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యలపై గళమెత్తి, ప్రజలకు నమ్మకం కల్పించలేక పార్టీని, అనుచరులను చంద్రబాబు నాయుడుకు గుంపగుత్తగా తాఖట్టు పెట్టారని అన్నారు.చంద్రబాబు నాయుడు కనుసన్నల్లో రాజకీయ పబ్బం గడుపుకునే దుర్భరమైన స్థితిలో ఉన్న జనసేన నాయకులను చూస్తుంటే జాలేస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శిస్తే ప్రచారం వస్తుందని, తద్వారా తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవచ్చునని జన సేన నాయకులు ఆరాటపడుతున్నారని హేళన చేశారు.ప్రజల్లో గుర్తింపు రావాలంటే ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలు పై అలుపెరుగని పోరాటం చేయాలి తప్ప బానిసత్వ రాజకీయాలను ప్రజలు హర్షించరని అన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయం అని, పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా సినిమాలో క్యారెక్టర్ వేసుకుంటే అతని కోరిక తీరుతుంది ఏమో గాని నిజజీవితంలో శాసనసభలో అడుగుపెట్టడం కలగానే మిగులుపోవడం తధ్యం అని సుమన్అన్నారు.

ఆళ్ల నాని పుట్టినరోజు సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ

ఏలూరు,మేజర్ న్యూస్: స్థానిక లంకపేట ఇజ్రాయిల్ పేటలో మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ జరిగింది.పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ పెరికే వరప్రసాదరావు తెలిపారు. ఆళ్ల నాని అష్ట ఐశ్వర్యాలతో,మరిన్ని పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.కరోనా టైంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి రాష్ట్ర మంతా సుడిగాలి పర్యటన చేశారని, కరోనా కు భయపడకుండా దానిని అరికట్టటంలో ఆరోగ్య శాఖ మంత్రిగా తన శక్తి యుక్తుల్ని ఫణంగా పెట్టికృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై ఎస్ ఆర్‌సి పి దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందుల కిరణ్ పాల్గొని మహిళలకు చీరల పంపిణీ చేసినట్టు పెరికె వర ప్రసాదరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024లో మళ్లీ ఆళ్ల నానిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న స్వర్ణకార కుటుంబానికి సంతాపం

ఏలూరు,మేజర్ న్యూస్: అనకాపల్లిలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న స్వర్ణకార కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సంతాపం తెలియజేసింది. ఆదివారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేట లోని సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు జిల్లా కన్వీనర్ ఆ గో ల్ల కృష్ణారావు వారి కుటుంబానికి సంతాపం సానుభూతి తెలియజేశారు.

వన సమారాధనను తలపించిన ఆళ్ల నాని జన్మదిన వేడుకలు

దెందులూరు,మేజర్న్యూస్: స్థానిక గోపన్నపాలెంలో తోటలో రెండో డివిజన్ కార్పొరేటర్ జున్నూరు కనక నరసింహారావు ఆధ్వర్యంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు జిల్లా వైఎస్ఆర్ సిపి అధ్యక్షులు ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఆళ్ల నాని జన్మదిన శుభ సందర్భంగా తోటలో అన్న సమారాధనను తలపించేలా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మెడికల్ బోర్డు డైరెక్టర్ దిరసాల వరప్రసాద్, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి ఫ్రూట్స్, స్వీట్స్ అందరికీ పంచిపెట్టారు. అందరికీ అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వైఎస్ఆర్ సిపి పార్టీ చేస్తున్న మంచి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మమ్ములను మా కుటుంబ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని సిఎం జగన్ ఆధ్వర్యంలో ఆళ్ల నాని ఏలూరుని అన్ని రంగాలుగా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లంట్ల పరమేశ్వరరావు దంపతులు, విశ్వనాథ మాధవరావు,రామాంజనేయులు, పోతురాజు, టి కోటేశ్వరరావు, లాయర్ నాగేశ్వరరావు ,పప్పు కూర్మారావ్ ,బోండా నరేష్, బాలాజీ ,అనంత్, పురుషోత్తమ కుమార్ పాల్గొన్నారు.

అఖండ అన్న సమారాధన

పాలకొల్లు, మేజర్ న్యూస్: స్థానిక నాగరాజు పేటలో వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమితి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయము నందు అఖండసమారాధన ఆదివారం జరిగింది, ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు, ఆలయ ధర్మకర్త గుమ్ములూరి రామకృష్ణ శాస్త్రి, యనమండ్ర ప్రభాకర శాస్త్రి, మిర్తి పార్టీ వెంకట సూర్యనారాయణ, చిర్రావుల వెంకట నరసింహారావు, సేలంశెట్టి సుబ్బారావు, అంబటి శేషగిరి, కౌర అప్పారావు, మేరు ఉవెంకట నాగ సాంబశివరావు, వీరా లోకేష్ విరా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

పెనుగొండ,మేజర్న్యూస్:జనవరి 5,6,7 తేదిలలో రాజమండ్రిలో జరుగుతున్న రెండో తెలుగు ప్రపంచ మహాసభలకు పెనుగొండ ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులను, పెనుగొండ ఎస్వీకేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శర్మ ,అధ్యాపకులను, చెరుకువాడ జెడ్ పీ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పెండ్యాల భరణి కుమార్,ఉపాధ్యాయులను, పెనుగొండ కోట్ల వెంకట్రామయ్య బాలిక ఉన్నత పాటశాల తెలుగు మీడియం ప్రధాన ఉపాధ్యాయురాలు భ్రమరాంబిక, ఇంగ్లీష్ మీడియం ప్రధాన ఉపాధ్యాయులు నీహారిక, ఉపాధ్యాయలను ఆహ్వానించడం జరిగిందని ఆంధ్ర సారస్వత పరిషత్ ఉత్సవ కమిటీ సభ్యులు చదువుల సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత, రమ్య సాహితీ సంస్థ వ్యవస్థాపకులు ఎమ్మార్వీ సత్య నారాయణ మూర్తి ,ప్రముఖ కథకులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎన్ కె నాగేశ్వరరావు , చిర్ల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతా హృదయంతో స్పందించిన కలెక్టర్

సెరెబ్రల్ పాల్సీ(మస్తిష్క పక్షవాతం)
బాధిత బాలుడికి రూ. 30 వేల ప్రత్యేక ఉపకరణం అందజేత

ఏలూరు, మేజర్ న్యూస్ :జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మంచి మనిషి, మానవతా వాది, సామాజిక స్పృహవున్న అధికారిగా మరోమారు నిరూపించుకున్నారు. జగనన్నకు చెబుదాం..స్పందన కార్యక్రమంలో పెదవేగి మండలం టి.గోకవరంకు చెందిన మాండ్రు చక్రవర్తి అర్జీనిస్తూ తన కుమారుడు మాండ్రు లెమన్ స్టోన్ (4 సం.)పుట్టుకతో సెరెబ్రల్ పాల్సీతో బాధపడుతున్నాడని తన కుమారుడికి వైద్య సహాయం అందించాలని కోరారు. బాధిత బాలుడిని చూసి చలించిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బాలుడికి అవసరమైన వైద్య సహాయం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు.

అంతేకాకుండా బాలుడికి ఊతంగా నిలిచే రూ. 30 వేల రూపాయలు విలువైన సిపి వాకర్, డిబి స్ప్లింట్, యూనివర్సల్ స్ప్లింట్‌తో కూడిన ఉపకరణాలను బెంగుళూరు నుంచి సొంత నిధులతో రప్పించారు. వాటిని శనివారం రాత్రి ఏలూరు కలెక్టరేట్‌లో బాలుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా మాండ్రు లెమన్ స్టోన్ తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిలకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, పెదవేగి తహశీల్దారు ఎన్.నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

ఏలూరు, మేజర్ న్యూస్ : పవన్ కళ్యాణ్ నిజాయితీ, పోరాట పటిమను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి సైకో జగన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఏలూరు నియోజవర్గ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి పేరు ఎత్తడానికి ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. చట్ట ప్రకారం, న్యాయ వ్యవస్థ ద్వారా విడాకులు తీసుకున్న తర్వాతే పవన్ కళ్యాణ్ వివాహం చేసుకున్నారని, ఎవరికీ అన్యాయం చేయలేదన్నారు. జగన్ రెడ్డి వంశంలో చట్ట విరుద్ధంగా అనేక వివాహాలు చేసుకున్న విషయం గుర్తు చేసుకోవాలని నిలదీశారు. రెండు రోజుల క్రితం భీమవరంలో విద్యా దీవెనకు పరదాల చాటున వచ్చిన జగన్ రెడ్డి విద్యార్థుల్లో విష సంస్కృతిని నింపే విధంగాను, సమాజాన్ని విచ్ఛిన్నం చేసే విధంగానూ, పెడదోవ పట్టే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు. రౌడీలా, మాఫియాలా, ఉగ్రవాదిలా క్రిమినల్ జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. తన సొంత పార్టీకి చెందిన వారే జగన్ రెడ్డిని అసహ్యాయించుకుంటున్నారన్నారు. చ%శీ%చల్ గూడా జైలులో 16 నెలలు గడిపిన జగన్మోహన్ రెడ్డి మళ్ళీ

జైలులో చిప్పకూడు తినేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి పట్టిన చీడను వదిలించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. మరోసారి తమ నాయకుడు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సిరిపల్లి ప్రసాద్, జనసేన పార్టీ నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశి నరేష్, నాయకులు అల్లు సాయి చరణ్, ఎట్రించి ధర్మేంద్ర, నూకల సాయి ప్రసాద్, గుదే జగదీష్, చిత్తిరి శివ తదితరులు పాల్గొన్నారు.

అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు : బిజెపి నియోజకవర్గ కన్వీనర్ జిఆర్‌కె

ఆగిరిపల్లి మేజర్ న్యూస్: నూజివీడు నియోజకవర్గంలో అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలను నూజివీడు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ జిఆర్‌కె రంగారావు తెలిపారు. ఆదివారం బిజెపి మండల కార్యాలయంలో జిఆర్‌కె మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజలకు,పార్టీ కార్యకర్తలు, నాయకులుకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కర్షకులకు,కార్మికులకు,ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలవారికి తదితర అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో అందరు సుఖ,సంతోషాలతో జీవనం సాగించాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

గ్రూప్స్ ఉచిత కోచింగ్ ప్రారంభం, బోఫ్ డైరీస్ ఆవిష్కరణ

విజయవాడ,ఏలూరు, మేజర్ న్యూస్: గ్రూప్1,2 పోటీ పరీక్షల కొరకు డిసెంబర్ 31 ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్లో బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బోఫ్)చే ఉచిత కోచింగ్ కార్యక్రమానికి ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగాబోఫ్ 2024 డైరీస్ ఆవిష్కరణ కూడా జరిగింది.బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 జనవరి ఒకటి న ఆన్ లైన్ (గూగుల్ మీట్) ద్వారా సాయంత్రం 7:00 గంటలకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ బహుజన నాయకులు డాక్టర్ జే.బి రాజు, గుబ్బల నాగేశ్వరావు , ఇంజనీర్ దుంగా రత్న ప్రదీప్, లీగల్ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్లు –అడ్వకేట్స్ కందికట్టు నరసింహారావు ,యమ్ శివ కుమార్ పాల్గొంటారని తెలిపారు . కుల – మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన అభ్యర్థులు అర్హులేనని శిక్షణా తరగతుల టీచింగ్ వింగ్ కన్వీనర్ పెరియార్ పూలే తెలిపారు. గ్రూప్స్ ఉచిత శిక్షణ కొరకు ఆసక్తి కలిగిన వారు ఫోన్ నెంబర్ 94405 39808 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బహుజన నాయకులు , కెమిస్ట్రీ ప్రొఫెసర్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.ఉచితంగా క్లాసులు బోధించడానికి ఆసక్తి కలిగిన మానవతావాదులైన అధ్యాపకులు , ప్రొఫెసర్స్ దయచేసి సమాఖ్యని సంప్రదించవచ్చుని బోఫ్ జాతీయ ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ నూతక్కి కృష్ణ రేఖ తెలిపారు.బోఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ముతవల్లి అబ్దుల్ సాలార్,బోఫ్ వెస్ట్ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యాల వీణయ్య, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కొమరగిరి శ్రీనివాసరావు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దేవరకొండ సాంబశివరావు, బహుజన నాయకులు ఈసారి బాల నరసింహుడు, ప్రణీత్ వర్మ ,పిఠాపురం ప్రమీల గాంధీ , సాలా బోగేశ్వరావు ,మహ్మద్ బే గ్,శివ బాల నాగరాజు,రాములు,వీర నారాయణమ్మ ,కుమార్, రమేష్,వసంత్,శివయ్య, సుధీర్ , తదితరులు పాల్గొన్నారు.

చిన్న గోపురంలో 15వ రోజు ఉత్సవాలు

పాలకొల్లు, మేజర్ న్యూస్:శ్రీ అష్టభుజలక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస వ్రత ఉత్సవములు వైభవ ముగా జరుగుతున్నవి ఆదివారం 15వరోజు సందర్భంగా శ్రీమాన్ కరి పవన్ స్వామి వారు శ్రీ స్వామి వారిని పాండురంగడిగా అలంకరించారు శ్రీమాన్ పి రంగనాథ స్వామి వారు తిరుప్పావై పాశుర విశేషములను భక్తులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జవ్వాజి పానకాలు ఛైర్మన్ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఈఓ పిటి గోవిందరావులు పాల్గొన్నారు ధనుర్మాస కమిటీ సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు చేశారు

నర్సాపురంలో కబాడీ ఆడిన అంగన్వాడీలు

నర్సాపురం,మేజర్ న్యూస్ :సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి ఉద్యోగులు చేపట్టిన సమ్మె 20 వ రోజుకు చేరుకున్నది.దీనిలో భాగముగాఅంబేద్కర్ సెంటర్లో అంగన్వాడి ఉద్యోగులు వినూత్న రీతిలో ఆడుదామా అంగన్వాడి అని పేరుతో కబాడీ పోటీలు నిర్వహించుకున్నారు.ఈపోటీలో జగన్ జట్టు అంగన్వాడీ జట్లు మధ్య కబాడీ పోటీ వారవారిగా జరిగింది. ఈ పోటీల్లో జగన్ జట్టుకి రెండు పాయింట్లు అంగన్వాడి జట్టుకు పది పాయింట్లు వచ్చాయి.అంతిమంగా అంగన్వాడి జట్టు విజయం సాధించింది. జగన్ అవుట్ జగన్ అవుట్ అని పెద్ద ఎత్తున అంగన్వాడీ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు 20రోజుల నుంచి సమ్మె చేస్తుంటే జగన్మోహన్ రెడ్డి పట్టించుకోకుండా ఆడుదామా ఆంధ్ర పేరుతో తిరుగుతున్నారు తప్ప అంగన్వాడీలకి ఇచ్చిన హామీలను మాటను మర్చిపోయారని విమర్శించారు. అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు అన్నారు. రానున్న 99 రోజుల్లో ఫైనల్ మ్యాచ్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఆ మ్యాచ్లో తనకు తక్కువ పాయింట్లు రాకుండా చూసుకోవాలంటే కచ్చితంగా అంగన్వాడి కోర్కెలు పరిష్కరించాలని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి సంఘీభావంగా టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు పాలవలస తులసి రావు అంగన్వాడి ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము,అంగన్వాడీ తదితరులు పాల్గొన్నారు.

మాంటిసోరి స్కాలర్షిప్ టెస్ట్‌కు విశేష స్పందన

పాలకొల్లు, మేజర్న్యూస్: స్థానిక లజపతిరాయ్ పేటలోని మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాల ప్రాంగణంలోఅక్షర జూనియర్ కళాశాల,మాంటిసోరి జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు ఈ మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ కు సంబంధించినటువంటి ప్రశ్నపత్రాలను రిలీజ్ చేస్తూ మాంటిసోరి జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, పేద మధ్య తరగతికి చెందిన ప్రతిభావంతులైన, విద్యార్థులకు స్కాలర్షిప్స్ ఉచిత విద్య అందించాలని సదుద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. స్టడీ మెటీరియల్ బుక్ లెట్స్ ను రిలీజ్ చేసిన, పాలకొల్లు మండల విద్యాశాఖ అధికారి శర్మ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ బుక్ లెట్స్ విద్యార్థులు పదవ తరగతి అత్యధిక మార్కులు సాధించడానికి ఎంతగానో దోహద పడతాయని అన్నారు. ప్రతిభావంతులైనటువంటి పేద మధ్యతరగతి విద్యార్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలో ఉచిత విద్య , స్కాలర్షిప్స్ అందించే నిమిత్తం నిర్వహించిన, ఈ మెరిట్ స్కాలర్షిప్ టెస్టుకు వివిధ జిల్లా పరిషత్ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం హై స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్ కి సంబంధించిన సుమారు 1722 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షకి హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఐదు శాతం మంది విద్యార్థులకు, మెరిట్ స్కాలర్షిప్స్ అందించడంతోపాటు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాలలోను, త్వరలో ప్రారంభించబోయే అక్షర జూనియర్ కళాశాలలోనూ ఉచిత విద్యను కూడా అందించినట్లు ఎకడమిక్ డైరెక్టర్ కెవి కృష్ణ వర్మ తెలియజేశారు. ఈ పరీక్ష హాజరైన విద్యార్థులందరికీ కూడా టెన్త్ క్లాస్ సంబంధించినటువంటి మోడల్ క్వశ్చన్ పేపర్ బుక్లెట్ ని ఉచితంగా అందజేశారు. పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనేలా సహకరించిన, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులుకు , ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు ఆయన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.